జోరుగా.. జీరో దందా..!

పేరుకే జీఎస్టీ ఆ ఊసేలేని వైనం
- రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి!
- అక్రమ వ్యాపారానికి అధికారుల వత్తాసు



అశ్వారావుపేటరూరల్: ఏజెన్సీ కేంద్రమైన అశ్వారావుపేట హోల్‌సేల్, రిటైల్ వ్యాపారం జీఎస్టీ బిల్లులు లేకుండానే ఎక్కువ శాతం సరుకులు 'జీరో బిల్లు'తో సాగుతోంది. ఈ జీరో బిల్లు దందాకు ఎలాంటి అడ్డు అదుపు లేకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు భారీగానే గండి పడుతోంది. ఈ దందాకు అధికారులు వత్తాసు, అండదండలు ఉండటంతో అడ్డులేకుండా సాగుతోంది.

అశ్వారావుపేటను ఆనుకొని చుట్టుపక్కల ప్రాంతాలన్నీ గిరిజన మండలాలు, గిరిజన పల్లెలు కావడంతో జీరో దందాకు కేంద్ర బిందువుగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి స్థానిక వ్యాపారులకు వివిధ రూపాల్లో బిల్లులు లేకుండానే సరుకులు వస్తుండగా, కోట్లాది రూపాయాల సరుకులు వినియోగదారులకు, చిన్న చిన్న వ్యాపారులకు యథావిధిగా జీఎస్టీ బిల్లు ఇవ్వకుండా విక్రయాలకు పాల్పడుతున్నారు. కోట్లాది రూపాయాల సరుకులు వేరే రాష్ట్రాలతోపాటు జిల్లాలోని భద్రాచలం, ఖమ్మం, ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, చింతలపూడితోపాటు మరికొన్ని ప్రాంతాల నుంచి సరుకులు రావడం, వాటిని వ్యాపారులు తమ గోదాంలకు తరలించి అక్రమంగా నిల్వ ఉంచడం ఇక్కడ గతకొన్నేళ్లుగా షరామామూలే. పట్టపగలు, రాత్రి తేడా లేకుండా ఆయా సరుకులను జీరో బిల్లుతోనే ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా ఐరన్, వంట నూనెలు, ఎరువులు, పురుగుల మందులు, పంచదారా, బెల్లం, సిమెంట్, ఎలక్ట్రికల్ సామాన్లు, బంగారు, అభరణాలతో సహా అన్నీ రకాల సరుకులంతా జీరో బిల్లులతోనే సాగుతోంది. ఆయా సరుకులన్నీ ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు దిగుమతి చేస్తుంటాయి. ఇదంతా పట్టపగలే రోడ్డుపైనే సాగుతున్న అధికారులకు మాత్రం కనీసం పట్టడం లేదు.

బోర్డులకే పరిమితమా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నేరుగా ఆదాయాన్ని అందేలా జీఎస్టీ బిల్లులను ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం జీరో దందాకు బ్రేక్ వేసి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడటమే. కానీ అశ్వారావుపేటలో వ్యాపారులు మాత్రం జీఎస్టీ బిల్లును కేవలం బోర్డులకే పరిమితం చేశారనే ఆరోపణలు బహిరంగంగానే ఉన్నాయి. ఆయా దుకాణాల్లో, బోర్డులో మాత్రం జీఎస్టీ పిన్ నంబరును రాసి, వినియోగదారులకు మాత్రం బిల్లులే ఇవ్వడం లేదు. విద్యావంతులు జీఎస్టీ బిల్లు అడిగితే 'మీకే నష్టం..వద్దండీ' అనీ చెబుతుంటారు. దాంతో వ్యాపారే ఇవ్వడం లేదు కదా అని మాకేందుకేలే అంటూ బిల్లు లేకుండానే సరుకులను కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా ఒకటి రెండు పెద్ద షాపింగ్ మాల్స్‌లో మాత్రమే జీఎస్టీ బిల్లులు ఇస్తుండగా, మిగిలిన అన్నీ దుకాణాల్లో జీరోతోనే కాలం గడిపేస్తున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయాలు జీఎస్టీ బిల్లుల రూపంలో నష్టం వాటిల్లుతోంది.

అధికారుల వత్తాసుతోనే..

ఈ జీరో బిల్లు దందాను అరికట్టాల్సిన విజిలెన్స్, వాణిజ్య పనుల శాఖ అధికారుల వత్తాసుతోనే సాగుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఏళ్లుగా సాగుతున్న ఈ జీరో బిల్లు వ్యవహారంపై వాణిజ్య, విజిలెన్స్ అధికారులు అక్రమ వ్యాపారులతో మిలాఖత్ కావడంతోనే స్థానిక వ్యాపారులు అప్రమత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. ఆయా శాఖల అధికారులు కొంతమంది అక్రమ వ్యాపారులనే తమ ఏజెంట్లుగా, దళారులుగా పెట్టుకొని మిగిలిన అక్రమ వ్యాపారుల వద్ద నుంచి నెల నెల వసూళ్లు చేసి దండుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ వసూళ్ల దందా అంతా ఆయా శాఖల్లోని కింది స్థాయి అధికారుల పాత్రే కీలకమని తెలుస్తోంది. ఆయా శాఖలకు స్థానికంగా ఉన్న ఓ బడా వ్యాపారి, అధికార పార్టీను అడ్డుపెట్టుకొని దందాకు సహకరించేలా చక్రం తిప్పుతున్నట్లు వ్యాపారులే చెప్పడం గమనార్హం.


బిల్లు లేకుండా తరలిస్తున్న నూనె డబ్బాలు

మేనిఫెస్టోతో ప్రజలకు భరోసా..


ప్రచారం నిర్వహిస్తున్న రేగా కాంతారావు

గుండాల : బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోతో తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ భరోసానిచ్చారని ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎమ్మెల్యే కాంతారావు అన్నారు. శుక్రవారం గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ప్రచారం నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటింటికి సంక్షేమపథకాలు అందించి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అన్నారు. దేశంలో ఇంటింటికి మంచినీళ్లు, ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాలతో ప్రజలను మభ్యపెట్టే మాయమాటలతో గ్రామాలకు వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాలను అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి కేసీఆర్ అండగా ఉంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పేదల జీవితాలలో వెలుగులు నిండాయన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో పినపాక నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయన్నారు. తనని గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు తెల్లం భాస్కర్, రవీందర్, బాబా, పాయం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి రామం

అశ్వారావుపేటరూరల్: పోలింగ్ కేంద్రాల్లో ఉన్న తాధికారుల ఆదేశాల ప్రకారం అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని నియోజకవర్గ నోడల్ అధికారి ఎస్. రామం అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సెక్టార్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సెక్టార్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకొని ఆయా సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. కేంద్రాల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సెక్టార్ అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికి తోడ్పడదాం


కార్మికులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో కార్మికులు ప్రైవేట్ సంస్థలకు దీటుగా రక్షణతో కూడిన ఉత్పత్తికి పాటుపడాలని రక్షణబృందం తనిఖీ కన్వీనర్ సురేశ్(జీఎం ఎస్టేట్స్) అన్నారు. శుక్రవారం ఓసీ–2లో 54వ రక్షణ వారోత్సవాల సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ఎన్ని గొప్ప లక్ష్యాలు సాధించినా చిన్న పొరపాటు నిర్లక్ష్యం అందరినీ అభాసుపాలు చేస్తుందని గుర్తించాలన్నారు. అందరూ రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 'నారక్షణ నాబాధ్యత' కార్యక్రమం పేరిట నాజర్‌పాషా నిర్వహించిన నాటిక అందరికీ ఆకట్టుకుంది. అదేవిధంగా ఓసీ–2 గనిలో నిర్మించిన రోడ్డు, డంప్‌యార్డు, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, మొబైల్ క్రషర్, క్షేత్రస్థాయిలో అమలవుతున్న రక్షణ నియమనిబంధనలను తనిఖీ చేశారు. అదేవిధంగా రెస్క్యూ బృందం క్షతగాత్రులను రక్షించే విధానంపై డెమోను తిలకించారు. కార్మిక సంఘాలు అందిస్తున్న సహకారాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా పలు కార్మికులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రక్షణ తనిఖీ బృందం సభ్యులు శ్యామ్ సుందర్, కేసగాని వేలాద్రి, సునీల్ కుమార్, లింకన్ రాకేశ్ శర్మ, జీఎం దుర్గం రాంచందర్, అధికారులు వీసం కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, రమణ, నర్సిరెడ్డి, వీరభద్రుడు, శ్రీనివాసాచారి, సలగల రమేశ్ ఉన్నారు.

క్లుప్తంగా

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన

చర్ల రూరల్: మండలంలోని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు లింగ నిర్ధారణ నిషేధ చట్టంనపై డిప్యూటీ డెమో ఎండీ. ఫైస్ మొయిద్దీన్ అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో చట్టవిరుద్ధంగా గర్భస్రావాలు చేసిన వారిపై శిక్షలు ఉంటాయని, గర్భస్రావాలు జరగకుండా చూడాలని, లింగ నిష్పత్తిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఆడపిల్లలను గర్భంలోనే చంపకుండా చూడాలని వారి ఎదుగుదలకు దోహదపడాలని ఆడపిల్లలను రక్షించడం అందరి బాధ్యత అని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మౌనిక, నాగలక్ష్మీ, రమాదేవి, బాబూరావు, సూపర్‌వైజర్లు కనకదుర్గ, అమ్మాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

అశ్వాపురం: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలోని మానవీయ వృద్ధాశ్రమంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పినపాక నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మట్టపల్లి సాగర్ యాదవ్ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, కోరెం రామారావు, రాసాల రమేష్, వెంకటేశ్వర్లు, నాగేష్, అఖిల్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

32 మంది బైండోవర్

బూర్గంపాడు: ఎన్నికల కోడ్ నేపథ్యంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 32మందిపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. అధికారులు బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 32 మందిని తహసీల్దార్ రాజారావు ముందు హాజరుపరిచగా వారిని బైండోవర్ చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా బిక్కుమళ్ల


సుధాకర్‌ను అభినందిస్తున్న నాయకులు

ములకలపల్లి: బీఆర్‌ఎస్ ములకలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా బిక్కుమళ్ల సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ములకపల్లి గ్రామశాఖ కమిటీని ఎన్నుకున్నారు. ములకలపల్లి అధ్యక్షుడిగా సుధాకర్‌తోపాటు, పలువురిని కమిటీలోకి తీసుకున్నారు. శనగపాటి సీతారాములు, బండి కొమరయ్య, చందర్‌రావు, కొండవీటి రాజారావు, నాగేశ్వరరావు, గుంట్రు కృష్ణ, సాయి, బీబినేని హరీశ్, నకిరకంటి పుల్లారావు, గోలి రమణ, కొట్టే శేషు, సిద్దెల వెంకటేశ్ పాల్గొన్నారు.

రైతుబంధుపై కాంగ్రెస్ వైఖరి సరికాదు


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రైతుబంధు సాయాన్ని నిలిపివేయాలంటూ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయడం సరికాదని స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అన్నారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదును తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరామ్మూర్తి, మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, చిన్నంశెట్టి వెంకట నరసింహం, యూఎస్ ప్రకాశ్ రావు, కాసాని చంద్రమోహన్, నారం రాజశేఖర్, జుజ్జూరు వెంకన్న, సంపూర్ణ, మోటూరి మోహన్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చర్ల రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని సింగ సముద్రం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ 74 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబిరంలో హెచ్ఈఓ వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, సిబ్బంది గీత, సమ్మక్క, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి..


దుమ్ముగూడెం: మాట్లాడుతున్న వెంకట్రావు


మణుగూరు రూరల్ : ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

చర్ల రూరల్: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు కోరారు. శుక్రవారం మండలంలోని మామిడిగూడెం, కుదునూరు గ్రామాల్లో పర్యటించారు. భద్రాచలం నుండి తనను గెలిపించి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ గౌడ్, ఎంపీపీ కోదండ రామయ్య, ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాసరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కాపుల నాగరాజు, ఎంపీటీసీ కుంజా నాగేశ్వరరావు, తుర్రం రవి, సీతాపతి రాజు, కొప్పినీడు బాబూరావు, తాతరాజు, ముప్పిడి రమేష్, కృష్ణార్జునరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని కాశీ నగరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలోసీపీఎంకు చెందిన 70 కుటుంబాలు వేమన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లోకి చేరారు. వీరికి బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు కండువా కప్పి ఆహ్వానించారు. జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, మండలాధ్యక్షుడు అన్నే సత్యనారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, నాయకులు తునికి కామేష్, ఎంపీటీసీలు సోడి తిరుపతిరావు, మడకం రామారావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్ : మండల పరిధిలోని సమితిసింగారం, కట్టుమల్లారం, కూనవరం, ముత్యాలమ్మనగర్ గ్రామ పంచాయతీల్లో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ల్యాబ్‌ల్లో తనిఖీలు


తనిఖీ చేస్తున్న అధికారులు

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఆర్ఎంపీ క్లినిక్‌లు, ప్రైవేట్ ల్యాబ్‌లను శుక్రవారం దుమ్ముగూడెం మెడికల్ ఆఫీసర్ పుల్లారెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో శ్రీ వెంకటేశ్వర ల్యాబ్‌కు సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో ల్యాబ్‌ను మూసివేయాలని సూచించారు. సోమవారం వరకు అనుమతి పత్రాలు తెచ్చుకొని ఎడల ల్యాబ్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే ఆర్ఎంపీల క్లినిక్‌లను తనిఖీ చేసి వారి వద్ద ఉన్న యాంటీబయాటిక్ ఇంజక్షన్లు, సెలైన్ బాటిళ్లను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాగర్, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు అన్యాయం

దుమ్ముగూడెం : దళితబంధు పథకంలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని దళిత హిందు మాలనాడు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాకులు జెట్టి వెంకట్రాజు విమర్శించారు. శుక్రవారం సీతారాంపురం గ్రామంలో జరిగిన ఆ సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో అర్హులైన దళితులకు కాకుండా ఇతరులకు పథకం వర్తింపచేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తాళ్ల మంగయ్య, జయబాబు, భిక్షం, జెట్టి వెంకటేశ్వర్లు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

కుమురం భీమ్ స్ఫూర్తితో ఉద్యమించాలి


భీమ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

దుమ్ముగూడెం: కుమురం భీమ్ స్ఫూర్తితో సమస్యలపై పోరాటాలు చేపట్టాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మారాయిగూడెం గ్రామంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కుమురం భీమ్ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ హక్కుల చట్టాలను కాలరాస్తూ ఈ మధ్యకాలంలో నూతన అటవీ సంరక్షణ చట్టం తీసుకొచ్చిందని ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీవో నెంబర్ 3ని ఆర్డినెన్స్‌తో రూపకల్పన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తోడం తిరుపతిరావు, కారం జోగయ్య, రాంబాబు, వెంకటేశ్వర్లు, సొంది ముదిరాజ్, ముత్తయ్య, చిన్నబ్బీ, సుభద్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్ ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చండ్రుగొండ : మండలకేంద్రం చండ్రుగొండలో అంబేడ్కర్ భవన్ ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ యువజనసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దారం గోవిందరెడ్డికి వినతిపత్రం అందించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని పార్టీల నాయకులకు విన్నపాలు అందిస్తున్నట్లు సంఘం నాయకుడు రాయి రాజా తెలిపారు. కాలనీల్లో కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బడుగు గణేష్, పాణ్యం నరేందర్ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయం పూజారి మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట–మల్లెలమడుగు గ్రామాల మధ్య ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ పూజారి మల్లెలమడుగు గ్రామానికి చెందిన జింకల కాంతమ్మ(75) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందింది. ఎన్నో ఏళ్లుగా ఆలయంలో కాంతమ్మ పూజలు నిర్వహిస్తోంది. కాంతమ్మ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, మున్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, సంఘం మణుగూరు మండల కార్యదర్శి సురేష్, నాయకులు, స్థానికులు, గ్రామస్తులు నివాళులర్పించారు.

పాయంకు టికెట్ కేటాయింపుపై హర్షం

మణుగూరు టౌన్: పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పాయం వెంకటేశ్వర్లు ఎంపికపై మణుగూరు మండల, పట్టణ కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని పూలమార్కెట్, అంబేడ్కర్ చౌరస్తా బాణాసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు


తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

అన్నపురెడ్డిపల్లి: మండలంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై శుక్రవారం కొత్తగూడెం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని మర్రిగూడెం, అబ్బుగూడెం, బుచ్చన్నగూడెం, అన్నపురెడ్డిపల్లి, పెంట్లం, నామవరం, రాజాపురం గ్రామాల్లో నుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల పై ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో 31 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు కిరణ్, రజిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి

- రోడ్డును కమ్మేసిన పిచ్చిమొక్కలు
- మలుపులు వద్ద సూచికలు కరువు
- ఇష్టారీతిన రోడ్డు ఆక్రమణ


ఇరువైపులా పెరిగిన మొక్కలతో మూసుకుపోయిన దానవాయిపేట-తాలిపేరు కాల్వ రోడ్డు

చర్ల: మండలంలోని ఆర్.కొత్తగూడెం– కుర్నపల్లి ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మార్గంలో పలు చోట్ల ఉన్న మలుపులు మృత్యుకుహరాలు ఉన్నాయి. ప్రధాన రహదారిపై పలు చోట్ల ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా ఉన్నప్పటికీ ఆయా ప్రాంతాలలో సూచికలు ఏర్పాటు చేయడంలో ఆర్అండ్‌బీ శాఖ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందంటూ ఆ రహదారిపై రాకపోకలు సాగించే ప్రజానీకం విమర్శిస్తున్నారు. రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లు రహదారిని మూసేసి ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనిపించక పోతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఆక్రమణలతో రోడ్డు ఇరుకు..

ఆర్.కొత్తగూడెం– దానవాయిపేట రహదారికి ఇరువైపులా వ్యాపారులు ఆక్రమణలు చేసి రహదారిపైకి చేరడంతో రోడ్డు ఇరుకుగా మారి సైతం ప్రమాదాలకు కారణమవుతోంది. ఆక్రమణదారులను నియంత్రించేందుకు అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడంతో మరి కొంత మంది వ్యాపారులు వారి వ్యాపార కార్యకలాపాలను రోడ్డపైకి తెచ్చి కొనసాగించేందుకు యత్నాలు చేస్తున్నారు. దానవాయిపేట నుంచి తాలిపేరు ప్రధాన కాలువ వరకు రోడ్డుకిరువైపులా మొలిచిన పిచ్చి మొక్కలు రహదారిని మూసేస్తుండడంతో రహదారి ఇరుకుగా మారడంతో పాటు మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. చింతగుప్ప–కుర్నపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా పలు చోట్ల ఈ వర్షాకాలంలో భారీగా కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకు పోయి గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిలో వెళ్లే వాహనదారులు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా ఆర్అండ్‌బీ శాఖాధికారులు ఈ రహదారిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


ఆక్రమణతో ఇరుకుగా మారిన రోడ్డు